## క్లుప్తంగా

### సంపత్ గణపతికి గరికపూజ



ప్రత్యేక అలంకరణలో సంపత్ గణపతి

బోట్‌క్లబ్: చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయం ఆవరణలో ఉన్న సంపత్ గణపతి ఆలయంలో స్వామికి బుధవారం గరికపూజ నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి గరికపూజ చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు ఆధ్వర్యంలో ఈ పూజ చేశారు. డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

### ఉత్సవాలకు పోలీసులు సహకరించాలి

బోట్‌క్లబ్: అనుమతుల పేరిట చవితి మండపాల నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌లకు పిలిచి ఇబ్బంది పెట్టడం సరికాదని నగర గణేశ ఉత్సవ సమితి కన్వీనర్ వై.మాలకొండయ్య అన్నారు. స్థానిక జగన్నాథపురం వినాయక సాగర్ వద్ద బుధవారం సమితి సమావేశం నిర్వహించారు. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు నిమజ్జనాలు సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. ఉత్సవాలకు పోలీసులు సహకరించాలని ఆయన కోరారు. నిమజ్జనాల వేళ సినిమా పాటలు, అశ్లీల నృత్యాలు, మద్యం తాగి తూగడాలు చేయవద్దని నిర్వాహకులకు పిలుపునిచ్చారు. 27వ తేదీన నిమజ్జనాల సందర్భంగా మధ్యాహ్నం సెలవు ప్రకటించాలని కోరారు. సమితి గౌరవ సలహాదారు దువ్వూరి సుబ్రహ్మణ్యం, సభ్యులు బండారు అయోధ్య రామయ్య, రంభాల వేంకటేశ్వరరావు, యార్లగడ్డ రామ్‌కుమార్, మొసలగంటి సురేష్, అరిపిరాల రామకృష్ణ, జి.భానోజీరావు పాల్గొన్నారు.

### సత్యాత్మతీర్థ దర్శనానికి మధ్వులు పయనం

బోట్‌క్లబ్: చాతుర్మాస్య దీక్ష నిర్వహిస్తున్న ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామిని దర్శించుకునేందుకు కాకినాడ మధ్వసభ సభ్యులు బుధవారం హోలి హున్నూరు బయలుదేరి వెళ్లారు. వారం రోజుల పాటు మధ్వగురువులు మూల బృందావనాల దర్శనం, నవ బృందావనంతో పాటు స్వామీజీని దర్శించుకుని పాదపూజలు చేసి తప్త ముద్రాధారణ స్వీకరించునున్నట్లు మధ్వసభ కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి తెలిపారు.


### విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

కరప: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ కాకినాడ ప్యానల్ న్యాయవాదులు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయ సహాయం ఆవశ్యకత, అవసరంలో ఉన్నవారు దానిని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కమిటీ కాకినాడ ప్యానల్ న్యాయవాదులు డాక్టర్ వై.వసంత, పేపకాయల గోపాలకృష్ణ, టి.రాజేష్, కె.లక్ష్మీనారాయణ, మామిడిపల్లి రాజేష్, పారా లీగల్ వలంటీర్లు బి.బసవరామస్వామి, ఆర్.మల్లికార్జునరావు, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రముగ్ధం.. మాన్విత వేణుగానం..



గణపతి ఆలయంలో వేణువుపై కీర్తనలు ఆలపిస్తున్న మాన్విత

కాకినాడ కల్చరల్: స్థానిక 50 బిల్డింగ్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతి ఆలయం వద్ద బుధవారం రాత్రి మాన్విత వేణుగాన కచేరీ ఏర్పాటు చేశారు. ఈమె మోహన, కల్యాణి, హరికాంభోజి తదితర రాగాలలో ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలను వేణువుపై ఆలపించి ఔరా అనిపించారు. అనంతరం ఈమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె. అప్పారావు, చైతన్య విద్యాసంస్థల ఏజీఎం డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షకు సన్నాహాలు

- కాకినాడ అర్బన్ పరిధిలో ఏర్పాట్లు
- కీలకం కానున్న వలంటీర్లు, ఏఎన్‌ఎంలు
- 13 యూపీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు



బీసీ కాలనీ-2 మూడో వార్డు సచివాలయంలో వలంటీర్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఆరోగ్య సురక్ష నిర్వహణకు నగరం సన్నద్ధతోంది. నగరంలోని 13 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. సంబంధిత ప్రణాళికను మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల అనుసంధానంతో నగర యంత్రాంగం విడుదల చేసింది.

**సర్వే ప్రారంభం**

జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య శిబిరాలకు పంపాల్సిన వారి వివరాల నమోదుకు సర్వే చేస్తున్నారు. శుక్రవారం నుంచే ఈ సర్వే ప్రారంభమైంది. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ప్రతి సచివాలయ పరిధిలో ఈ సర్వే చేస్తున్నారు. వలంటీరు సూచించిన ఇంటికి సందర్శించే ఏఎన్‌ఎం అక్కడి వారి ఆరోగ్య స్థితిపై ఆరా తీసి ఏమైనా సమస్యలుంటే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ఇందులో కంటి, రక్త, మధుమేహం, రక్తపోటు వంటి ఏడు పరీక్షలు ఉంటాయి. ప్రత్యేక యాప్‌లో సదరు రిపోర్టులను నమోదు చేస్తారు. ఇవే కేస్ షీట్లుగా సిద్ధమవుతాయి. నిర్ణీత తేదీల్లో నిర్వహించే శిబిరాల్లో నిపుణులైన వైద్య బృందం నివేదికలు అనుసరించి వైద్య సేవలు చేస్తారు.

**నిపుణుల సేవలు**

జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం నిపుణులైన వైద్యులతో రోగులకు వైద్యం చేయడం. ఏఎన్‌ఎంలు, వలంటీర్ల సర్వేలో నమోదైన రోగులు నిర్ణీత తేదీన యూపీహెచ్‌సీకి రావాలని కోరుతూ వారి పేరున టోకెన్ ఇస్తారు. వైద్యులు పరీక్షించి తక్షణ వైద్య సేవలు అందించి, మెరుగైన వైద్యానికి ఉన్నత ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేస్తారు. అంతేకాక, ఆరోగ్యశ్రీ అనుబంధ కార్పొరేట్ ఆసుపత్రులకు సైతం సిఫార్సు చేస్తారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా రోగులను తీర్చి దిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యం.

**ఏ తేదీలలో ఎక్కడి యూపీహెచ్‌సీలో..**

వచ్చేనెల నాలుగున ప్రకాశం వీధి, ఐదున జట్లపెదకాపు వీధి, ఆరున రేచర్లపేట, ఏడున సీతారాం నగర్, తొమ్మిదిన రెవెన్యూ కాలనీ, 11న సంజయ్ నగర్, 13న కొండబాబు కాలనీ, 16న నేతాజీ పార్కు, 17న ఎన్టీఆర్ నగర్ నార్త్ వింగ్, 19న నరసింహ రోడ్డు, 21న ప్రతాప్ నగర్, 26న రామారావుపేట, 28న రెల్లిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

# పోషకాహారంతో ఆరోగ్య సమాజం

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి
- ఘనంగా జాతీయ పోషకాహార మాసోత్సవాలు



కరపలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించిన నాయకులు, అధికారులు

కరప: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, పీహెచ్‌సీ సీహెచ్‌ఎస్‌ఓ వై.రత్నకుమారి తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వివిధ రకాల పోషకాలతో తయారుచేసిన అటుకుల పోహా, చోడిపిండి లడ్డు, ఆకుకూరల పకోడి, మునగాకు చపాతీ తదితర వంటకాలను ప్రదర్శించారు. ఆయా వంటకాలను వారు పరిశీలించి వాటిని చేసినవారిని అభినందించారు.

**సామూహిక సీమంతాలు..**

ఈ సందర్భంగా 9 మంది గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాశనలను బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, దేశభక్తి గీతాలు అలరించాయి. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సీడీపీఓ లక్ష్మి, కరప, గొర్రిపూడి సెక్టార్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, విజయలక్ష్మి, పేపకాయల శ్రీను, పేకేటి లక్ష్మీకాంతం పాల్గొన్నారు.



అంగన్‌వాడీలు ప్రదర్శించిన పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

### సెమినార్లతో శాస్త్రీయ దృక్పథం



ఎంఎస్‌ఎన్‌లో నిర్వహిస్తున్న సైన్స్ సెమినార్

బాలాజీచెరువు: మల్లాడి సత్యలింగ నాయకర్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ఈ సెమినార్ సహకరిస్తుందని, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మదర్ థెరిస్సా మున్సిపల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎ.దీపిక రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. సెమినార్‌లో 28 పాఠశాలల నుంచి 38 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు ఎంపిక

సామర్లకోట: స్థానిక భావయామి ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన ఫోక్ డాన్స్ విభాగంలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో సామర్లకోట విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఎంపికైన విద్యార్థినులు విజయలాస్య, శ్రీవల్లి, అభినయ, లీలాశ్రీ, యామినిలను స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి గంజి బూరయ్య, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజులు అభినందించారు.

### సాహిత్యంలో స్త్రీల పాత్ర కీలకం

కాకినాడ కల్చరల్: ప్రాచీన సంస్కృతాంధ్ర సాహిత్యంతో పాటు, ఆధునిక సాహిత్యంలోనూ స్త్రీల పాత్ర కీలకమైందని విశ్రాంత తహసీల్దార్, కవి కారుప్రోలు గౌరినాయుడు అన్నారు. స్థానిక రామారావుపేటలోని శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచార సభ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సాహితీ ప్రసంగాలు నిర్వహిస్తున్నారు. స్త్రీ -సాహిత్య విశ్లేషణ అన్న అంశంపై బుధవారం సభ జరిగింది. సభ అధ్యక్షుడు మార్ని జానకీరామ్ చౌదరి ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు మహిళా రచయితలు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రచారసభ ఉపాధ్యక్షుడు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, ఆకెళ్ల శ్రీరామచంద్రమూర్తి, పెండెం శ్రీదేవి, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్



డాక్టర్ కృతికా శుక్లా

కాకినాడ: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పదవీకాలాన్ని పొడిగించారు. ఈ మేరకు పట్టణ పరిపాలనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారిగా ఆమె ఆరు నెలల పాటు కొనసాగడం, లేదా కొత్తపాలకవర్గం ఏర్పడే వరకు ఈ అదనపు బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది.

### 33 శాతం మహిళా రిజర్వేషన్లు హర్షణీయం



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మల మడక నాగమణి హర్షం వ్యక్తం చేశారు. చట్టసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో మహిళా లోకానికి సముచిత స్థానం దక్కిందన్నారు.

# గుడిసె వాసులకు పట్టాలు



ఎల్‌బీ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 46వ డివిజన్‌లో గడపగడపకూ

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ 46వ డివిజన్ పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో గుడిసెల్లో ఉంటున్న వారందరికీ పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే కుసాల కన్నబాబు హామీ ఇచ్చారు. డివిజన్‌లోని సచివాలయం 46బి పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం పరిపాలన సాగిస్తున్నారన్నారు. డివిజన్‌లోని సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సచివాలయ సిబ్బంది, అధికారులకు సూచనలిచ్చారు. మాజీ కార్పొరేటర్లు బాలప్రసాద్, ఐ.శ్రీను, కడియాల చిన్న, సీనియర్ నాయకులు గోపిశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల జడలు కత్తిరించిన టీచర్

- టీచర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ): స్థానిక పాఠశాలలో బుధవారం ఓ టీచర్ ఆగ్రహంతో విద్యార్థినుల జడలు కత్తిరించారు. తిలక్ వీధి సూర్యనారాయణ పురం సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థినులు కొద్ది రోజులుగా ఒకేలా రెండు జడలు వేసుకుంటున్నారు. దీనిపై టీచర్ మంగతాయారు హెచ్చరించినా ఆమె మాట వినలేదు. దీంతో టీచర్ ఆ విద్యార్థులను దూషిస్తూ తరగతి గదిలో సహ విద్యార్థుల ఎదుటే వారి జడలు కత్తిరించారు. బాధిత విద్యార్థులంతా కన్నీటి పర్యంతమై వద్దని వేడుకున్నా ఆమె కనికరించలేదు. జరిగిన సంఘటనను బాధిత విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారంతా పాఠశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. టీచర్‌పై హెచ్‌ఎం గౌరీ శంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీచర్ వైఖరిపై ఆయన డీఈఓ నాగమణికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో ఏఈవో రవి విచారణ చేపట్టి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కరప గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు పేర్కొన్నారు. గ్రామ సచివాలయం-2, వేళంగి గ్రామ సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ పరిశీలించి డిజిటల్ అసిస్టెంట్లకు పలు సూచనలిచ్చారు. ఆధార్‌కార్డులో పేర్లు తప్పుగా నమోదైనా, ఇంటి నంబర్లు, చిరునామా మారినా సవరించుకోవచ్చన్నారు. ఇంత వరకూ ఆధార్‌కార్డు తీసుకోని వారు కూడా ఈ కేంద్రాలకు వెళ్లి ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. గురువారం కొరుపల్లి, వేములవాడ సచివాలయాల్లోను, శుక్రవారం యండమూరు, నడకుదురు-1 సచివాలయాల్లోను, 23న పెనుగుదురు-1, కూరాడ సచివాలయాల్లో ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ విన్సెంట్ కుమార్ వృద్ధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా విన్సెంట్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో అల్జీమర్స్ సహజమని, చిత్త వైకల్యం వల్ల ఈ సమస్య వస్తుందని, ఇది రావడానికి స్పష్టమైన కారణం ఏదీ లేదన్నారు. కుటుంబ చరిత్ర, జన్యువుల వల్ల సహజంగా వస్తుందని, జీవన శైలిలో మార్పులు వలన వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షకుడు పార్థసారధి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని ఎప్పుడు కాపాడుకుంటూ ఉత్సాహంగా జీవించడానికి దోహదం చేస్తుందని తెలిపారు.

### ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్‌డేకు ఎంపికలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ప్రాంగణం ఇండోర్ స్టేడియంలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిబిరానికి ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ యూత్ ఆఫీసర్ సైదా రమావత్ హాజరై ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం, క్రమశిక్షణ, నైతిక విలువలపై అవగాహన పెంపొందుతాయన్నారు. వివిధ స్థాయిల్లో జరిగే ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభను బట్టి జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారన్నారు. జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న ఐదు జిల్లాల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమణాశ్రీ, కిరణ్మయి పాల్గొన్నారు.

### మెస్ చార్జీలు పెంచాలి

కాకినాడ సిటీ: పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, కాకినాడ జిల్లాలో శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టల్‌కు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, జగన్నాథపురం బాలుర హాస్టల్ విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు గంగా సూరిబాబు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదం



పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లను ఎగురవేస్తున్న దృశ్యం

- కలెక్టర్ కృతికా శుక్లా
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రత్యేక అవసరాల చిన్నారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా సహిత విద్యలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వివిధ క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ క్రీడలు ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లల్లో భావ సమతౌల్యం, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. పోటీలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ ఆటలు సమగ్ర మూర్తిమత్వానికి దోహదపడతాయన్నారు. స్లోవాక్, సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్, అసిస్టెడ్ వాక్, షాట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, ఉప విద్యాశాఖ అధికారులు సుభద్ర, ఆర్‌జేడీ రాజు, కాకినాడ రూరల్ ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, బంగారురాజు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరుగులో పోటీ పడుతున్న విద్యార్థులు

### పౌర సరఫరాల విభాగం పోస్టుల భర్తీకి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: జిల్లా పౌర సరఫరాల సంస్థలో వివిధ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను బుధవారం జిల్లా సెలక్షన్ కమిటీ పరిశీలించింది. నోటిఫికేషన్‌లో టీఏఎస్, డీఈవోలు, హెల్పర్ పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించినట్లు పౌర సరఫరాల విభాగం డీఎం డి.పుష్పమణి వివరించారు.

### మహిళలకు తగిన ప్రాధాన్యం

బోట్‌క్లబ్: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం లభించడంతో మహిళలకు ఇకపై మరింత ప్రాధాన్యం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ జనాభాలో సగం మందికి దేశంలోని అత్యున్నత చట్టాలను రూపొందించే సంస్థలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. 75 ఏళ్ల చరిత్రలో సువర్ణాక్షరాలతో నమోదు చేయదగ్గ రోజన్నారు.